ప్రజాశక్తి

ఆదివారం 10 డిసెంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

నేవీ విన్యాసాలకు సర్వం సిద్ధం

సిద్ధం చేసిన కుర్చీలు

- విశాఖ తీరంలో నేడు యుద్ధ హోరు
- ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ రాక
- భారీ సంఖ్యలో హాజరుకానున్న ప్రజానీకం

ఆర్‌కె బీచ్‌లో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

నింగి, నేల, నీరు.. ఎక్కడైనా శత్రుమూకలను మట్టుపెట్టగలిగే వ్యూహాత్మక ఎత్తుగడలు తూర్పు నౌకాదళం సొంతం. దీని కీర్తి ఎంతో విశిష్టం. అటువంటి మన నేవీ శక్తి సామర్థ్యాలను అందరికీ తెలుసుకోవాలనే ఉంటుంది. ఇంకెందుకు ఆలస్యం.. ఆదివారం విశాఖ తీరానికి వచ్చేయండి. ఇక్కడి విన్యాసాలు ఒళ్లు జలదరింపజేస్తాయి. నావికుల పోరాటాలు గగుర్పాటుకు గురిచేస్తాయి.

దేశం గర్వించదగ్గ నేవీ డే వేడుకలు ఈ నెల 4న జరగాల్సి ఉండగా మిచౌంగ్ తుపాను కారణంగా 10కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈసారి ప్రధాన విన్యాసాలను వీక్షించేందుకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఇంకా పలువురు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, గౌరవ అతిథులు, తూర్పు నౌకాదళ ఉన్నతాధికారులు రానున్నారు. నగర ప్రజానీకం కూడా పెద్ద ఎత్తున తరలిరానుంది. ఈ నేపథ్యంలో నేవీ, ప్రభుత్వ యంత్రాంగం కూడా భారీ ఏర్పాట్లు చేసింది. ఆర్‌కె బీచ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.

అబ్బురపరచనున్న విన్యాసాలు

నావికాదళం ఈ సారి అత్యంత అద్భుతమైన ప్రతిభా పాటవాలు, శక్తి యుక్తులతో కూడిన ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు ఉన్నతాధి కారులు వెల్లడించారు. నౌకలు, సబ్‌మెరైన్‌లు, యుద్ధ విమా నాలు, ప్రత్యేక నావికాదళ బలగాల సముద్ర తీర ప్రదర్శనలు అబ్బుర పరచనున్నాయి. యుద్ధ సమయాల్లో నౌకలు నిర్వహించే పాత్ర, అందులో దళాల శక్తియుక్తులపై ప్రత్యేకంగా ఆపరేషన్స్‌ను నావికాదళం చేపట్టనుంది. యుద్ధ విమానాలు ఒకదానికొకటి ఎదురెదురుగా మిగతా 2లో..

ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న కమిషన్ సభ్యులు

ఘోసాలో వైద్య సేవలపై ఆరా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు గొండు సీతారాం వన్‌టౌన్‌లోని ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి (ఘోసాసుపత్రి)ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. హైరిస్క్ పిల్లల వార్డును, ఇతర వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు అందిస్తున్న సేవలపై బాలింతల నుంచి ఆరా తీశారు. వార్డుల్లో సిసి కెమెరాలను పరిశీలించారు. బరువు తక్కువతో పుట్టిన పిల్లలపై ఎటువంటి వైద్య ప్రక్రియ చేపడుతున్నారో వైద్యులను అడిగి తెలుసు కున్నారు. గర్భిణులకు మిగతా 2లో..

13 నుంచి శ్రీ కనక మహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవతగా పేరుగాంచిన, బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 13 నుంచి జనవరి 11వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. శనివారం దేవస్థానం అన్నదాన భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యనిర్వహణాధికారి కె.శిరీషతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 13న ఉదయం 8.01 గంటలకు విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఉత్సవాలు ప్రారంభిస్తారని తెలిపారు. నెల రోజులు పాటు మిగతా 2లో..

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

వార్త 2లో..

మూసిన రోడ్డును తెరవాలని జనసేన నిరసన

వార్త 2లో..

రాంకీ విష వ్యర్థ జలాలతో చేపలు మృత్యువాత

వార్త 5లో..

వైసిపికి కార్పొరేటర్ సాధిక్ రాజీనామా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ పార్టీకి, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ పదవికి రాజీనామా చేశారు. శనివారం సాయంత్రం కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ దక్షిణ నియోజక వర్గంలో తనతో పాటు వైసిపికి చెందిన వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. పలు మార్లు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి వైవి.సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేసినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందనా రాలేదన్నారు. దక్షిణ నియోజక వర్గంలో అవినీతి తీవ్ర స్థాయిలో ఉన్నట్టు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌తో చాలా మంది కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. వన్ టౌన్ ప్రాంతంలో ఎమ్మెల్యే వాసుపల్లి ఎటువంటి అభివృద్ధీ చేయడం లేదన్నారు. వన్ టౌన్ ప్రాంతంలో అధిక సంఖ్యలో ముస్లింలు ఉన్నప్పటికీ వారికి పదవులు ఇవ్వడం లేదన్నారు. దక్షిణ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. అందుకే తాను వైసిపికి రాజీనామా చేశానని, తనతో ఉన్న నాయకులతో మాట్లాడి భవిష్యత్తులో ఏ పార్టీలో చేరేదీ ప్రకటిస్తానన్నారు. ఇదిలా ఉండగా రెండేళ్ల క్రితం జరిగిన జివిఎంసి ఎన్నికల్లో వైసిపి మిగతా 2లో..

రాజీనామా పత్రం చూపుతున్న సాధిక్

శాస్త్రీయ ఆవిష్కరణలకు వేదికగా భారత్ నిలవాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శాస్త్రీయ ఆవిష్కరణలకు వేదికగా భారతదేశం నిలవాల్సి ఉందని టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ అన్నారు. శనివారం బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహించిన ఎయు పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం 'వేవ్స్ - 2023'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన దేశం నుంచి నోబెల్ బహుమతులు సాధించే వారి సంఖ్య పెరగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పరిశోధన రంగానికి పెట్టుబడులు మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మన సమస్యలు ప్రత్యేకమని, మనం చూపే పరిష్కారాలు దేశానికే కాకుండా ప్రపంచానికి దోహదపడుతున్నాయని అన్నారు. దేశంలో వనరులు ప్రజలందరికీ సమానంగా అందుబాటులో ఉండాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రాథమిక వైద్య, విద్యం అందరికీ చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో మహిళలు ఉద్యోగ రంగంలో మరింత ఎక్కువ మంది అడుగిడాలని సూచించారు. ప్రజల తలసరి ఆదాయంలో ఉన్న వ్యత్యాసాలు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఎయు ఇతర విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా నిలవాలన్నారు. సర్వేపల్లి, సివి.రామన్ వంటి మహనీయులు నడయాడిన ఈ ప్రదేశానికి రావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక ఛైర్మన్, జిఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ జిఎం.రావు మాట్లాడుతూ సమిష్టిగా లక్ష్యం దిశగా పనిచేస్తే సాధించడం సులభమవుతుందన్నారు. ఆంధ్ర విశ్వ విద్యాలయాన్ని మరింత ద్విగుణీకృతంగా అభివృద్ధి పథంలో నడిపించే దిశగా పూర్వ విద్యార్థుల సంఘం మిగతా 2లో..

మాట్లాడుతున్న నటరాజన్ చంద్రశేఖరన్

మొదటి పేజీ తరువాయి..

నేవీ విన్యాసాలకు సర్వం సిద్ధం

దూసుకువస్తూ ఢీకొనేటంతగా చూపరులను నిర్ఘాంతపోయేలాంటి సన్నివేశాలు ఆదివారం కనువిందుచేయనున్నాయి. మెరైన్ కమోండోల సాహసాలు కట్టిపడేయనున్నాయి. నీటిలో స్కై డైవింగులు చిన్న పిల్లలు నుంచి పెద్దల వరకూ అలరించనున్నాయి. ఇప్పటికే నిర్వహించిన నేవీ రిహార్సల్స్ అట్టహాసంగా సాగాయి. మర్గన్ హెలీకాప్టర్ల విన్యాసాలు, బాంబింగ్, రెస్క్యూ ఆపరేషన్, పారాషూట్ విన్యాసాలు ఔరా అనిపించాయి. చేతక్ హెలీకాప్టర్ ద్వారా జాతీయ జెండా ఎగరవేయడం, యుఎక్స్ హెలీకాప్టర్ విన్యాసాలు, హాక్ విమానాల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వీటన్నింటినీ మించిన నేవీ సంబరం ఆదివారం సాక్షాత్కరించనుంది.

గవర్నర్ పర్యటన ఇలా..

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నేవీ వేడుకలకు ముఖ్య అతిథిగా విశాఖకు రానున్నారు. ఆయన ఆదివారం ఉదయం 11:20 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 12:30 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడి నుంచి 12:40 గంటలకు పోర్టు గెస్ట్ హౌస్‌కు వెళ్తారు. విశ్రాంతి అనంతరం పోర్ట్ గెస్ట్ హౌస్ నుంచి ఆర్‌కె బీచ్‌కు చేరుకొని 4:12 గంటల నుంచి 5:35 గంటల వరకు నేవీ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం 5:40 గంటలకు సిరిపురం నేవీ హౌస్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక తేనేటి విందులో పాల్గొంటారు. 7:20 గంటలకు మరలా ఐఎన్ఎస్ డేగాకు చేరుకొని అక్కడి నుంచి 7:30 గంటలకు ప్రత్యేక విమానం ద్వారా విజయవాడ వెళ్తారు.

శాస్త్రీయ ఆవిష్కరణలకు వేదికగా భారత్ నిలవాలి

మరింత సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. ఎయు ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.సమత మాట్లాడుతూ వర్సిటీ ప్రగతిని వివరించారు.

నటరాజన్ చంద్రశేఖరన్‌కు ఘన స్వాగతం

ఎయు పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌కు ఘన స్వాగతం లభించింది. ఎయు పూర్వ ఉపకులపతి ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు చంద్రశేఖరన్ ఎయు పరిపాలనా భవనానికి చేరుకుని ఎన్‌సిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కె.సమత స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎయు పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజా, ఎ.మన్మోహన్, సంయుక్త కార్యదర్శి ఆకుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైసిపికి కార్పొరేటర్ సాధిక్ రాజీనామా

తరపున పోటీ చేసేందుకు సాధిక్ సిద్ధపడ్డారు. అయితే పార్టీ టిక్కెట్టు దక్కలేదు. దీంతో ఆయన 39వ వార్డు నుంచి కార్పొరేటర్ పదవికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. కార్పొరేషన్‌లో వైసిపి అధికారంలోకి రావడంతో ఆయన ఆ పార్టీలో చేరారు.

'ఘోసా'లో వైద్య సేవలపై ఆరా

నిర్వహించే స్కానింగ్ పరీక్షల్లో లింగ నిర్ధారణ గోప్యత విషయంలో అమలు చేస్తున్న విధి విధానాలపై అక్కడి సిబ్బంది, వైద్యాధికారులు నుంచి సమాచారం రాబట్టారు. వార్డుల్లో అమలౌతున్న సెక్యూరిటీ విధానాన్ని పరిశీలించారు. వారి వెంట సిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ ఎంఆర్ఎల్.రాధ, ఆసుపత్రి సిఆర్ఎంఒ డాక్టర్ రాధారాణి, డాక్టర్ మెహర్, డాక్టర్ గీతావందన పాల్గొన్నారు.

13 నుంచి శ్రీ కనక మహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

జరిగే ఈ మహోత్సవాలలో దాదాపు ఆరు లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మంచినీరు, వైద్య సదుపాయం కల్పించామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పోలీసు శాఖ సమన్వయంతో భద్రతా ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శిరీష మాట్లాడుతూ ఉత్సవాలలో భాగంగా భక్తుల కోసం కొత్త రోడ్డు జంక్షన్ నుంచి క్యూలైన్ ఏర్పాటు చేశామన్నారు. జగన్నాథ స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వికలాంగులు, చంటి పిల్లల తల్లుల కోసం కొత్త రోడ్డు జంక్షన్ నుంచి ఆటో ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుండి 9 గంటల మధ్యలో ప్రముఖుల కోసం దర్శన ఏర్పాట్లు చేశామన్నారు. గాజువాక, సింహాచలం, మధురవాడల నుంచి భక్తుల కోసం ఉచిత బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ కె.తిరుమలేశ్వరరావు, దేవస్థానం బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

15 నుంచి గ్రూపు 1, 2 శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం అధ్వర్యంలో గ్రూపు-1, గ్రూపు-2 శిక్షణ తరగతులు ఈ నెల 15 నుంచి డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు డాక్టర్ జి.ప్రియాంక తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తిగల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం 918886578595 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఇది అభ్యర్థులకు మంచి అవకాశమని, వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైపరీత్యం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : మిచౌంగ్ తుపాను రైతుకు కన్నీళ్లు మిగిల్చింది. ఇంటికి రావాల్సిన పంట కళ్లెదుట కుళ్లిపోతుంటే రైతు దు:ఖాన్ని భరించలేకపోతున్నాడు. పెట్టుబడికి చేసిన అప్పు తీర్చి, మిగిలిన పంటను కుటుంబ అవసరాలకు నిల్వచేసుకుందామనుకున్న రైతుకు ఈ తుపాను తీరని శోకం మిగిల్చింది. అలముకున్న కరువును దాటుకొని పండించిన వరి పంటను మిచౌంగ్ మింగేసింది. నవంబరు వరకు అనావృష్టితో పంటవేయలేక బాధపడగా, డిసెంబరు మొదటి వారంలో అతివృష్టి వేసిన పంటను నాశనం చేసింది. కరువును గుర్తించి రైతును ఆదుకోవడంలో మీనమేషాలు లెక్కించినట్లే, తుపానుకు పంట నష్టపోయిన రైతును ఆదుకోవడంలో కూడా ప్రభుత్వం ఎడతెగని జాప్యం చేస్తోంది. కష్టంలో వున్న రైతుకు ఉపశమనం కల్గించాల్సిన కనీస కనికరం కూడా చూపడంలేదు. తుపానుకు పోయిన పంటను తక్కువగా చూపడమెలా అని ఆలోచిస్తున్నట్లుంది తప్ప, ఆదుకునేలా అడుగులు వేయడంలేదు. ప్రకృతి విపత్తులతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఉదారంగా ఆదుకొనే మార్గాలు అన్వేషించాలి తప్ప సాంకేతిక అంశాలు అడ్డంపెట్టుకొని దాటవేసే పద్ధతిని ఎంచుకోవడం సముచితంకాదు. ఇది ప్రజా ప్రభుత్వ లక్షణం కానేకాదు.

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తలెత్తినప్పుడు కరువును గుర్తించడంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. కరువు జిల్లాగా ప్రకటించాలని జిల్లా పరిషత్ సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసి పంపినా ప్రభుత్వ మనసు కరగలేదు. పండిన పంట కోసుకొని ఇంటికి తీసుకెళ్దామనుకొనేలోగా ముసురు తెచ్చిన ముప్పు రైతును కోలుకోలేకుండా చేసింది. కోతకొచ్చిన పంట నీటమునిగి నిరుపయోగంగా మారింది. ఈ పరిస్థితుల్లో వాస్తవ నష్టాన్ని అంచనా వేసేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని గుర్తించే పని ప్రారంభించాలి. మడుల్లో చేరిన నీటితో మురిగిన పంట నష్టాన్ని లెక్కించాలి. కానీ ఈ ప్రభుత్వానికి రైతు గోడు పట్టినట్లులేదు. పంట నష్టం గుర్తించాలని ఇంతవరకు ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించే తీరిక కూడా ఈ ప్రభుత్వానికి వున్నట్లు లేదు. అనావృష్టి, అతివృష్టి ప్రకృతి వైపరీత్యాల్లా కన్పించినా, వాస్తవానికివి ప్రభుత్వ విపత్తులే. సాగునీటి వనరులు పుష్కలంగాలేని జిల్లాలో ప్రతిపాదిత పోలవరం ఎడమకాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తిచేసి సాగునీటి వనరులు కల్పిస్తే సకాలంలో వరి పంట సాగు జరిగేది. ఆగస్టు నాటికి వరి పంట వేయగలిగితే నవంబరు నాటికి కోతలుచేసుకొని ఇంటికి పంట వచ్చేది. వర్షాధారంతో సాగులో జరిగిన ఆలస్యం, చేతికొచ్చిన పంట తుపానుకు దొరికింది. సాగునీటి వనరులుంటే రైతుకు ఈ కష్టం వచ్చేదికాదు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,36,460 ఎకరాల్లో వరి సాగుకావాల్సివుంటే 1,10,765 ఎకరాల్లో (81 శాతం) సాగు జరిగింది. వర్షాల్లేక దాదాపు ఆరు వేల ఎకరాలు ఎండిపోవడమో, వాడిపోవడమో అయింది. మరో 50 వేల ఎకరాలకు పైగా పంట తుపానుకు నీళ్లపాలైంది. కౌలురైతు పరిస్థితి మరీ దయనీయంగా వుంది. కౌలుకు, పెట్టుబడికి పంటరాక కౌలు రైతు మరింత అప్పులపాలుకావాల్సిన దుస్థితి సంభవించింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మనసు పెట్టి ఆలోచించి నష్టపోయిన రైతును ఆదుకోవాలి. తక్షణమే పంట నష్టం అంచనా వేసి సాగుదారుకు పరిహారం చెల్లించేందుకు ముందుకురావాలి.

మూసిన రోడ్డును తెరవాలని జనసేన నిరసన

పలువురు నాయకులు అరెస్ట్

జనసేన నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సంపత్ వినాయక ఆలయం నుంచి సిరిపురం జంక్షన్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో పార్లమెంట్ సభ్యులు ఎంవివి. సత్యనారాయణకు చెందిన నిర్మాణంలో ఉన్న వెంచర్‌కు వాస్తు దోషం ఉందని చెప్పి నిత్యం రద్దీగా ఉండే రోడ్డును మూసి వేయడాన్ని నిరసిస్తూ శనివారం జనసేన ఆధ్వర్యంలో టైకూన్ హోటల్ వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చిన జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌ను ముందుగానే ఆయన గృహం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని ఎంవిపి స్టేషన్‌కు తరలించారు. అనంతరం టైకూన్ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న జనసేన నాయకులను, కార్యకర్తలను, ఎంవిపి, త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వందల మంది రాకపోకలు సాగించే మార్గాన్ని వాస్తు దోషం పేరిట మూసి వేయడం దుర్మార్గమని జనసేన పిఏసి సభ్యులు కోన తాతారావు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆరోపించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకరరావు, కోన తాతారావు, ఉత్తర ఇంచార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, చోడవరం నియోజవర్గ ఇంచార్జ్ పివిఎస్ఎన్.రాజు, కార్పొరేషన్‌లో జనసేన ఫ్లోర్ లీడర్ భీసెట్టి వసంత లక్ష్మి, కార్పొరేటర్ దల్లి గోవింద రెడ్డి తదితరులు ఉన్నారు. విషయం తెలియడంతో జనసేన పిఏసి రాష్ట్ర ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అరెస్టయిన నాయకులను, కార్యకర్తలను పరామర్శించారు.

ఎమ్మెల్యే వాసుపల్లి సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వారం వారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆర్థిక సాయం కోసం వచ్చిన, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న తొమ్మిది మందికి ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శనివారం వారి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి అందజేశారు. లబ్ధిపొందిన వారిలో 30, 31, 34, 36, 37, 38 వార్డులకు చెందిన వారు ఉన్నారు.

వాల్తేరు డివిజన్‌ను కొనసాగించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయనున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో వాల్తేరు డివిజన్‌ను యధాతథంగా కొనసాగించాలని ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షులు ఎస్ఎస్.శివ శంకర్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు శనివారం విశాఖ వచ్చిన రైల్వే శాఖ మంత్రిని శివ శంకర్ బృందం కలిసి ఈ అంశంపై సమగ్ర నివేదిక అందజేసింది.

కలెక్టర్‌ను కలిసిన విశాఖ బాలోత్సవ నాయకత్వం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 14, 15, 16 తేదీల్లో విశాఖ బాలోత్సవం ఆధ్వర్యంలో సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో జరిగే 'మెగా చిల్డ్రన్ ఫెస్టివల్'కు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను విశాఖ బాలోత్సవ నాయకత్వ బృందం శనివారం కలిసి అభ్యర్థించింది. ఈ బృందంలో విశాఖ బాలోత్సవ ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.ఎల్లాజీ, డాక్టర్ బి.గంగారావు ఉన్నారు. చిల్డ్రన్ ఫెస్టివల్ నిర్వహణ వివరాలను తెలియజేశారు. అనంతరం కలెక్టర్ బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. చిల్డ్రన్స్ ఫెస్టివల్ నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని నిర్వాహకులు కలెక్టర్‌ను కోరారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో ప్రాణ త్యాగాలను, భావోద్వేగాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిలిపివేయాలని ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 982వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసికి చెందిన ఎంఇఎస్ యూనియన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ మహా నగరం ప్రభుత్వ రంగ సంస్థల నిలయమన్నారు. వీటి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేలాది కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.A.276/2022 in E.A.54/2018 in E.P.260/2011 in O.S.117/2005
Between:
Sri M.AppalaNaidu ...D.Hr/Plaintiff
And
Sri S. Rama Rao & another ...J.Drs/Defendants
NOTICE
To,
R-2: Sri Surapati Appala Raju, S/o. Rama Rao, Hindu, aged 29 years,Eguvapeta,Bheemunipatnam Mandal, Visakhapatnam Dist.
R-3: Sri Surapati Lakshmi Narayana, S/o. Rama Rao, Hindu, aged 48 years, Business, R/at Annavaram,Bheemunipatnam Mandal, Visakhapatnam Dist.
R-4: Sri Surapati Hari Babu, S/o. Rama Rao, Hindu, aged 41 years, Business, Rest-do-
Please take notice that the above E.A.276/2022 in E.A.54/2018 in E.P.260/2011 in O.S.117/2005 filed by Sri M. Appala Naidu against you stands posted to **29-12-2023** for your notice and appearance. So you are hereby informed to appear before the Hon'ble Principal Senior Civil Judge Court, at Visakhapatnam on **29-12-2023** at **10:30 A.M** in person or through an Advocate otherwise an ex-parte order will be passed against you.
(By Order of the Hon'ble Court)
BEVARA SATYANARAYANA
KARRI (K) DEEPTHI SREE
Advocates, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE XI ADDL. DISTRICT JUDGE cum SPL.JUDGE FOR SC & ST CASES AT: VISAKHAPATNAM
O.S.55/2023
Between:
Kasireddi Ramanamma & 2 others ...Plaintiffs
And
Nerella Sathi Raju & Another ...Defendants
SUMMONS
To,
D-1: Nerella Sathi Raju, S/o. Ramulu, Hindu, aged 61 years, R/at D.No.58-15-125/1,Santhi Nagar, NAD Kotha Road, Visakhapatnam -530009.
D-2: Smt. Nerella Kalyani, W/o. Sathi Raju, Hindu, aged 56 years, Rest-do-
Please take notice that the above-named plaintiffs has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **04-01-2024** for your appearance. Therefore, you are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **04-01-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
P. RAMJI,
M (P) HEMALATHA,
Advocates,Visakhapatnam.

పట్టణ కాలుష్య నివారణకు పరిష్కారాలు

అంతర్జాతీయ సదస్సులో గీతం అధ్యక్షుడు శ్రీభరత్

సదస్సులో మాట్లాడుతున్న శ్రీభరత్

ప్రజాశక్తి-మధురవాడ : పట్టణ ప్రాంతాలలో పెరుగుతున్న కాలుష్య సమస్యలకు పరిశోధకులు పరిష్కార మార్గాలను అన్వేషించాలని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయనిక శాస్త్ర విభాగం ఆధ్వర్యాన రెండు రోజులుగా జరుగుతున్న రసాయనిక శాస్త్రవేత్తల అంతార్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ ముగింపు సభలో శ్రీభరత్ మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాలలో ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే హరిత సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. శిలాజ ఇంధన వనరులు అడుగంటుతున్న తరుణంలో ప్రత్యామ్నాయ ఇంధన ఉత్పాదన, శక్తి ఉత్పాదనను నిల్వ చేసుకునే బ్యాటరీల తయారీపైన పరిశోధనలు జరగాలన్నారు. ముంబైలోని హోమీ బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ సవితా లడగే మాట్లాడుతూ, దేశంలో రసాయనశాస్త్ర విద్యకు విశేష కృషి జరుగుతోందని ముఖ్యంగా పండిట్ మదన్ మోహన్ మాలవ్య నేషనల్ మిషన్ ఆన్ టీచర్స్ అండ్ టీచింగ్ నూతన బోధనా విధానాలపై దృష్టి పెట్టిందన్నారు. కోవిడ్ సమయంలో రసాయనశాస్త్రంలో ఈ కంటెంట్ ద్వారా థియరీ, ప్రాక్టికల్ శిక్షణకు అనువైన సిలబస్ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాబా అణుశక్తి పరిశోధనా కేంద్రం (బార్క్) మాలిక్యులర్ బయాలజీ విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ హరిశరణ్ మిశ్రా, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, రసాయనిక శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ బి.శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.మూర్తి, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎ.జనా తదితరులు పాల్గొని ప్రసంగించారు.

గీతంలో జిఎస్ఇఎ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-మధురవాడ : విద్యార్థులలో నూతన ఆవిష్కరణలను, పారిశ్రామికవేత్తలుగా మారాలనే ఆలోచనలను ప్రోత్సహించడానికి అంతర్జాతీయ సంస్థ గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డ్స్ (జిఎస్ఇఎ) ఈ ఏడాది నిర్వహించిన పోటీలలో విజేతలకు శనివారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేసింది. ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆర్గనైజేషన్ (ఇఒ) ఆంధ్రప్రదేశ్‌శాఖ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా డెసిషన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్, వియ్ ఫౌండర్ సర్కిల్ సహ వ్యవస్థాపకుడు సౌరభ్ డియో, ఎఫ్‌ట్రానిక్స్ ఉపాధ్యక్షుడు అన్వేష్ దాసరి వ్యవహరించారు. అంతరిక్షంలోకి వెళ్లి తిరిగి భూభాగాన్ని చేరే ఉపగ్రహాలను మళ్లీ మళ్లీ వ్యయం లేకుండా వాడుకునే పరిజ్ఞానాన్ని సూచించినందుకు తారామండల్ టెక్నాలజీ బృందం ప్రథమ బహుమతి అందుకుంది. రొయ్యల సాగులో పర్యావరణహిత సాంకేతికతను రూపొందించి నందుకు కెపి ఇన్నోవేషన్స్ ద్వితీయ బహుమతిని, విద్యార్థుల వద్ద నిరుపయోగంగా ఉండే సామగ్రిని అవసరం ఉన్నవారికి అద్దెకు ఇచ్చే విధంగా రెంట్ యార్ యాప్ అభివృద్ధి చేసిన విద్యార్థి బృందానికి తృతీయ బహుమతిని అందజేశారు. గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఎంటర్ ప్రెన్యూర్స్ ఆర్గనైజేషన్ (ఇఒ) ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు విధాన్ మిట్టల్, అశ్వని గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇటీవల తుపానుకు మండలంలోని మజ్జిపేటలో దెబ్బ తిన్న వరి పొలాలను ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణరాజు (వాసురాజు), సర్పంచ్ మజ్జి సూరినాయుడు, మజ్జిపేట, దాకమర్రి ఎంపిటిసి సభ్యులు మజ్జి శ్రీను, చెల్లూరి నగేష్ బాబు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, వైసిపి నాయకులు పల్లా సన్యాసిరావుతో కలిసి శనివారం పరిశీలించారు. పంట నష్టం వివరాలను రైతులనడిగి తెలుసుకున్నారు. అప్పు చేసి పెట్టిన పెట్టుబడి వృథా అయిందని రైతులు ఆవేదన వ్యక్తం జేశారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎంపిపి వాసురాజు తదితరులు

ఎమెర్జింగ్ అండ్ కన్వర్జెంట్ యాక్సెస్ టెక్నాలజీస్‌పై సదస్సు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం రఘు ఇంజినీరింగ్ కళాశాలలో విశాఖ బిఎస్ఎన్ఎల్ సహకారంతో 'ఎమెర్జింగ్ అండ్ కన్వర్జెంట్ యాక్సెస్ టెక్నాలజీస్'పై మూడు రోజుల పాటు జరుగనున్న సదస్సు శనివారం ప్రారంభమైంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఆధ్వర్యాన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎపి ఇన్నోవేషన్ సొసైటీలో అడ్మినిస్ట్రేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ జాయింట్ డైరెక్టర్ లావణ్య, విశాఖ బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎంసత్య ప్రసాద్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. సమకాలీన లాండ్ స్కాప్‌లో యాక్సెస్ టెక్నాలజీస్ కీలక పాత్రను, ఔచిత్యాన్ని వివరించారు. ఇసిఇ విభాగాధిపతి, ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ కెపి.వినయ్ మాట్లాడుతూ, నేటి సాంకేతికత ఆధారిత యుగంలో ఎస్‌టిటిపి ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ జివి.శ్రీధర్ సదస్సుకు సమన్వయకర్తగా వ్యవహరించారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి అధ్యాపకులు సదస్సులో పాల్గొన్నారు. యాక్సెస్ టెక్నాలజీస్ రంగంలో వచ్చిన తాజా పురోగతిపై సదస్సులో చర్చించారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి -ఆనందపురం : నిబంధనలు పాటించని ప్రయివేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని సర్వ శిక్ష అభియాన్ ఎఎస్ఒ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్ఎస్ పద్మావతి ఆధ్వర్యాన ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో జిఇఆర్, యు -డిఐఎస్ఇ సిస్టమ్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థుల వివరాలు, డ్రాప్ అవుతున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు మండల విద్యాశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులు, డిజిటల్ ల్యాబ్‌లు, తరగతి గదుల వివరాలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి నిర్దేశించిన తేదీలోగా అన్ని నమూనాలతో కూడిన రికార్డులను అందించాలని చెప్పారు.

మ్యాజిక్ బస్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి -ఆనందపురం : మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్న వాలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి పేర్కొన్నారు. మేజిక్ బస్ ఆధ్వర్యాన ఆనందపురం మండల సచివాలయంలో పలు సేవలను అందిస్తున్న వాలంటీర్లను గుర్తించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజ సేవలో భాగస్వాములై ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలోనూ, ప్రజలు యొక్క విధులను హక్కులను గురించి జాగ్రత్త పరుస్తూ సమస్యలు పరిష్కరించడంలో మేజిక్ బస్ స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో మేజిక్ బస్‌కు వాలంటీర్లుగా సమాజంలో సర్వీస్ చేస్తున్నందుకు వారికి సర్టిఫికెట్లు ఇస్తూ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, ఎంపిటిసి సభ్యులు పిటిసి రమాదేవి, రెడ్డి బాబు, స్కూల్ ఛైర్మన్ అప్పలనాయుడు, కోటియాడ సత్యమూర్తి, మేజిక్ బస్ ప్రోగ్రాం మేనేజర్ కందిపల్లి ఆనంద్, ట్రైనింగ్ కం మోనిటరింగ్ ఆఫీసర్ దూడ రమేష్, శంకరరావు, యూత్ మెంటర్స్, రవణమ్మ, ఆదిలక్ష్మి, దుర్గ, రమ్య, శారద, యుషామా సాయి కుమార్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను శనివారం పలు రంగాలకు చెందిన ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించిన వారిలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, హైకోర్టు జడ్జి బి.శ్యామ్‌సుందర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఆలయ ఇఒ సాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి- ఆనందపురం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడిన వారికిభీమునిపట్నం 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జి.విజయలక్ష్మి శనివారం రూ.1,000 జరిమానా విధించారు. కమ్యూనిటీ సర్వీస్‌లో భాగంగా వారితో భీమిలి కోర్టు పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

నేరాలు ఘోరాలు

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఆరిలోవ : గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను ఆరిలోవ పోలీసులు అరెస్టుచేసి రిమాండుకు తరలించారు. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... కర్నాటక రాష్ట్రం గుగ్గీకి చెందిన బసవర్ మురళీకృష్ణ, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన బండి రాహుల్ హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో బర్గర్ కేఫ్‌లో పనిచేసేవారు. ఇటీవల వారిరువురు ఆ పని మానేసారు. అడ్డదారిలో సంపాదించేందుకు హైదరాబాద్ నుంచి నాలుగు రోజుల క్రితం అరుకు చేరుకున్నారు. అరుకులో ఓ వ్యక్తితో పరిచయం పెంచుకొని 5 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఆ గంజాయి ప్యాకెట్లు తీసుకొని విశాఖకు వచ్చారు. వారిని హనుమంతవాక వద్ద ఆరిలోవ పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్స్ పోలీసులు పట్టుకున్నారు. 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిఐ సోమశేఖర్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ యువకుడు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లోని కాలువలో కాంట్రాక్టు కార్మికుని మృతదేహం శనివారం లభ్యమైంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... స్టీల్‌ప్లాంట్ టిపిపి విభాగంలో ఎస్.కోట ప్రాంతం భవానిపురానికి చెందిన భాను (28) కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తున్నాడు. గత మంగళవారం విధులకు హాజరైన భాను సాయంత్రం నుంచి కనిపించకుండా పోయాడు. దీనిపై యాజమాన్యం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేసింది. ప్లాంట్‌లోని బ్యాటరీ-5 వెనుక కాలువలో ఆ యువకుని మృతదేహం ఉండడాన్ని శనివారం ఉద్యోగులు గమనించారు. వెంటనే సిఐఎస్ఎఫ్, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసేందుకు వారు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆ యువకుడు ఎలా చనిపోయాడు అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గోడ కూలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని బుచ్చిరాజుపేట పంచాయతీ శివారు నల్లమట్టిపాలెం గ్రామానికి చెందిన మాస సింహాచలంపై గోడ కూలి పోవడంతో మృతి చెందినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. శనివారం సింహాచలం పశువులు మేపుటకు గాను పాత పాడుబడిన గోడ పక్క నుండి వెళుతున్న సమయంలో ఒక్కసారిగా గోడ కూలి సింహాచలం పై పడింది. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు గమనించి గాయపడ్డ సింహాచలంను స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని గునుపూడి గ్రామానికి చెందిన వానపల్లి నాగేశ్వరరావు(66) అప్పుల బాధతో పురుగుమందు సేవించి మృతి చెందినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. నాగేశ్వరరావు కొన్ని నెలల క్రితం తనకు సంబంధించిన అర ఎకరం భూమిలో కొంత భూమిని అదే గ్రామానికి చెందిన లోవరాజుకు విక్రయించడానికి అగ్రిమెంట్ చేసుకుని రూ.5 లక్షలు తీసుకున్నాడు. వీటితో అప్పులు తీర్చాడు. అయితే భూమిపై గొడవలు ఉండటంతో లోవరాజు తాను ఇచ్చిన డబ్బులు ఇవ్వాలంటూ నాగేశ్వరరావును కోరాడు. మూడు నెలల క్రితం పెద్దలు పంచాయతీ పెట్టడం జరిగింది. అప్పులు ఎక్కువ అవడంతో నాగేశ్వరరావు శుక్రవారం పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక సిహెచ్‌సికి తరలించగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించడానికి అంబులెన్స్ ఎక్కిస్తుండగా నాగేశ్వరరావు మృతి చెందాడు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అవంతిలో 12 నుంచి వర్క్‌షాప్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు ఇంజినీరింగ్ గ్రాఫిక్స్‌పై వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించి కళాశాలలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఎయు పూర్వ ఆచార్యులు డాక్టర్ బివిఆర్.గుప్త, ఎయు పూర్వ ఉప కులపతి డాక్టర్ కె.రాంజీ, ప్రొఫెసర్ డాక్టర్ నారాయణరావు, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ బి.సతీష్, అవంతి ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఫ్యాకల్టీ జి.రాము పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవంతి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఎ.అర్జున్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి -గాజువాక : జీప్సా ఆధ్వర్యాన గాజువాకలోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై శనివారం టిఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులందరూ కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకొని తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి గౌరీశంకరరావు మాట్లాడుతూ, మార్చిలో జరగబోవు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఏయే పాఠ్యాంశాలు ఎలా చదవాలి, జవాబులు ఎంత సమయంలో ఎలా రాయాలి తదితర అంశాలను వివరించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వేణు కల్యాణ్ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలు ఏర్పరచుకొని వాటి సాధనకై కృషి చేయాలని కోరారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు వేణు కల్యాణ్

చెడు అలవాట్లకు, చెడ్డ స్నేహితులకు దూరంగా ఉంటే లక్ష్యాలను చాలా సులువుగా సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 పాఠశాలల నుంచి 1000 మంది విద్యార్థులు, జీప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాసరావు, వాసుదేవరావు, మురళీ, జగన్, నాయుడు, కుమార్, విజయ్, బాబూరావు, జనార్ధనరావు, చైతన్య పాల్గొన్నారు.

విశాఖ రత్న కళాపరిషత్ రజతోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ అనుబంధ సంస్థ విశాఖ రత్న కళాపరిషత్ 25వ వార్షికోత్సవ సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సహజ నటుడు చంద్రమోహన్‌కు కార్యక్రమాన్ని అంకితమిస్తూ 'శీతలు సింగారం మాలచ్చి బంగారం' అనే పేరుతో సంగీత, నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు కళాసారథి పిఎ భాస్కరరావు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, సినీ హీరో ఉపేంద్ర, దర్శకుడు దుగ్గివలసి దివాకర్, సామాజిక విశ్లేషకులు సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతలకు జ్ఞాపికలు సర్టిఫికెట్లు బహుకరించారు. వాగ్దేవి సంగీతం నృత్య పీఠం దర్శకులు సీతాలక్ష్మి శిష్యులచే నృత్య ప్రదర్శనలు, బొమ్మిడి సత్యనారాయణ, మనోపల్ల బృందంచే సినీ గీతాలాపన, వివిధ రంగాల కళాకారులచే కళా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కర్రి సత్యనారాయణ, డాక్టర్ కుమార్‌నాయక్, ఎస్‌కె.మదీనా, హేమ వెంకటేశ్వర్, వర్రే నాంచారయ్య, నమ్మి అప్పలరాజు, మనోజకుమార్, రంగాల బాబూరావు, వానపల్లి శ్రీమన్నారాయణ, చైతన్య, కీలు కంగవత తదితరులు అవార్డులు స్వీకరించారు.

'భవిష్యత్తు గ్యారెంటీ'ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి -గాజువాక : 'బాబూ ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ'ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టిడిపి శ్రేణులకు ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గాజువాక నియోజవర్గ బిసి సెల్ అధ్యక్షులు తమ్మిరెడ్డి శివప్రసాద్ రూపొందించిన పోస్టర్‌ను శనివారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలుగుదేశం, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో చూసి వైసిపి నాయకుల్లో ప్రకంపలు మొదలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అక్కిరెడ్డి శ్రీనివాసరావు, నాయకులు కొరికిన చంద్రరావు, కర్ణాటక గోపి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు దుంగ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -గాజువాక : అగనంపూడి పునరావాసకాలనీ పెదమడక శ్రామిక కమ్యూనిటీ హాల్లో అగనంపూడి లయన్స్ క్లబ్, ప్రథమ క్లినిక్ ఆధ్వర్యాన ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. కంటి, సాధారణ వైద్య పరీక్షలు చేశారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కళావతి

అగనంపూడి ఏరియా ఆసుపత్రి హోమియోపతి అధికారి డాక్టర్ కె.కళావతి మాట్లాడుతూ, అన్ని జబ్బులకు హోమియోపతి మందులు మన ఆసుపత్రిలో ఉన్నాయని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారుగా 100 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రథమ క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ కరణం జోగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ జిల్లాపరన్ గుడే సుశీల గజేంద్రరావు, క్లబ్ అధ్యక్షుడు ఎమ్ జగదీష్, ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, నాయకులు నెల్లి శ్రీనివాసరావు, కొలిపాక అప్పారావు, వియదల వరహాలు, సాయిని సన్యాసిరావు, మాడిసి వెంకట్రావు, మోటూరి వెంకటరమణ, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహార ప్యాకెట్లు అందిస్తున్న వైద్య సిబ్బంది

క్షయ రోగులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి- మధురవాడ : క్షయరోగులకు పౌష్టికాహార ప్యాకెట్లను మలేరియా విభాగం ఆధ్వర్యాన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు శనివారం పంపిణీచేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన జోడిగుళ్లపాలెంలో శనివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 800 మందికి రక్త పరీక్షలు, బీపీ, క్షయ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వారిలో 18 మందిని క్షయ (కఫం పరీక్ష నిమిత్తం) పంపించారు. ఈ కార్యక్రమంలో సాగర్‌నగర్ వైద్యాధికారి డాక్టర్ భరత్, మధురవాడ టిబి యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనంలో రూబీజూబ్లీ వేడుకలు

వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీ ఎంవివి.సత్యనారాయణ

ప్రజాశక్తి-సీతమ్మధార : అంబేద్కర్ భవనం 40 వసంతాల (రూబీ జూబ్లీ) వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఎఎంఎస్) ప్రధాన కార్యదర్శి జెవి.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు మార్గదర్శకం అన్నారు. అంబేద్కర్ జీవితం యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్నా దళితుల స్థితిగతుల్లో మార్పు రాలేదన్నారు. రాజ్యాంగ హక్కులు పొందేందుకు అందరూ సమిష్టిగా పోరాడాలన్నారు. ఎఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆలోచన విధానాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.అర్జున, కెజిహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, ఎజె.స్టాలిన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, మైనార్టీ సంఘం నాయకులు ఐఎం అహ్మద్, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ఇంటి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల నిర్వహణకు మైదానాల పరిశీలన

ప్రజాశక్తి -ములగాడ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని పశ్చిమ నియోజకవర్గం పరిధిలో వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ నిర్వహించే క్రికెట్ మ్యాచ్‌లకు శనివారం మైదానాలను పరిశీలించారు. జింక్ గ్రౌండ్, కోరమండల్, షిప్‌యార్డు, గోపాలపట్నంలోని మైదానాలను ఏపీ ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్, జాబ్స్ ఫెయిర్ సలహాదారు శ్రీధర్ రెడ్డి, క్రికెట్ క్రీడా నిపుణులు, కోచ్‌లతో ఆనంద్‌కుమార్ పరిశీలించారు. పిచ్‌ల పరిస్థితి, ఏ విధమైన సౌకర్యాలు కల్పించాలన్నదానిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్ , కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, నాయకులు అంగ రాంప్రసాద్, పిల్ల కన్నబాబు, సోమాదుల సురేష్ పాల్గొన్నారు.

క్రికెట్ ఆడి మైదానాలను పరిశీలిస్తున్న ఆనంద్‌కుమార్

దురాచారాల నిర్మూలనకు మానవ హక్కులు అవసరం

ప్రజాశక్తి -ములగాడ : సమాజంలో దురాచారాలైన వరకట్నం, బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా తదితర సమస్యల పరిష్కారానికి మానవ హక్కులు ఎంతో అవసరం అని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యాన మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యక్తిత్వ వికాసానికి, సమాజ ప్రగతికి, ప్రజాస్వామ్యం విజయవంతం అవ్వడానికి, మూఢ నమ్మకాల నిర్మూలనకు మానవహక్కులు ఎంతో అవసరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో మహిళా సాధికారిత

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సొంట్యాం ఎన్ఎస్ఆర్ఐటి కళాశాలలో మహిళా సాధికారత కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన మహిళల స్వీయ రక్షణ, లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో డైరక్టర్ మురుగదాస్ మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థినులకు రక్షణపై అవగాహన కలుగుతుందన్నారు. అనంతరం దువ్వాడ మహిళా పోలీస్ మీను భూషణ్ కోటను కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ హెడ్ డాక్టర్ మాధవి, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

దానప్పతల్లి పండగ

ప్రజాశక్తి - గాజువాక : జివిఎంసి 87వ పరిధి దుగ్గపువానిపాలెంలోని దానప్పతల్లి అమ్మవారికి సారె, ముగ్రాట కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. దుగ్గపువానిపాలెం, కాశీపాలెం, కణితికాలనీకు చెందిన భక్తులు 108 కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి చేరుకొని పూజలు నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక వైసిపి ఇన్‌ఛార్జి దేవన్‌రెడ్డి హాజరై అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డి.అప్పారావు, బి.అప్పలసత్యం, ప్రగడ వేణుబాబు, ప్రగడ శ్రీనివాస్, పూడి ఆనంద్, పిన్నింటి సంతోష్, ముద్దపు దామోదర్, బొడ్డ సన్యాసిరావు, దుగ్గపు దానప్పలు, బొడ్డ గోవిందా, మార్పు శేషు పాల్గొన్నారు.

అన్ని కుటుంబాల్లో వెలుగులు

ప్రజాశక్తి - ఆరిలోవ : దేశంలోని అన్ని కుటుంబాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. జివిఎంసి 9వ వార్డు పరిధి సాగరతీరం, జోడుగుళ్లపాలెంలో శనివారం ఆయన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబంలో జన్మించిన నరేంద్ర మోడీ పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించడం, అర్హులైన వారిని ఈ పథకాల్లో భాగస్వాములుగా చేర్పడయూ ధ్యేయంగా ఈ యాత్ర సాగుతుందన్నారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర క్యాలెండర్‌ను, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు జివిఎల్ నర్సింహారావు, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, మాజీ ఎమ్మెల్సీ మాధవన్, విశాఖ రైల్వే డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్, సెంట్రల్ బ్యూరో ఆసిస్టెంట్ డైరెక్టర్ షాఫీ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

దీపోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభంలో ఈ నెల 12వ తేదీన జరుగనున్న అనంతపద్మనాభస్వామి దీపోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లను పద్మనాభం సిఐ సన్యాసినాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు శనివారం పరిశీలించారు. కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డును, కొండ దిగు మార్గంలో ఉన్న మెట్లు మార్గాన్ని, కుంతి మాధవస్వామి ఆలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలు పార్కింగ్, భక్తులు రాకపోకలు ఇబ్బందులు లేకుండా, చర్యలు చేపట్టారు. విజయనగరం నుంచి పద్మనాభం, పద్మనాభం నుంచి తగరపువలస, పద్మనాభం నుంచి సింహాచలం పోయే మార్గాల్లో వాహనాలకు పార్కింగ్‌ను సిద్ధం చేస్తున్నారు.

తుపాన్ బాధిత రైతులకు పరిహారం చెల్లించాలి

- కూరగాయల పంట నష్టాలను గుర్తించకపోవడం సరికాదు
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సిపిఎం, రైతు సంఘం నేతలు

దెబ్బతిన్న టమాటా పరిశీలిస్తున్న వెంకన్న, రైతులు

మిచౌంగ్ తుఫాను వలన పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించిన ఆదుకోవాలని సిపిఎం, ఏపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తుపాన్ వల్ల దెబ్బతిన్న పంట పొలాలను శనివారం వారు పరిశీలించారు.

ప్రజాశక్తి-దేవరాపల్లి

తుపాన్ వల్ల మండలంలో కూరగాయల రైతులు పూర్తిగా కుదేలయ్యారని, వారిని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర డిమాండ్ చేశారు. మండలంలోని దేవరాపల్లి, నాగయ్యపేట, మారేపల్లి, వెంకటరాజుపురం తదితర గ్రామాల్లో శనివారం సిపిఎం నాయకులు దెబ్బతిన్న కూరగాయల పంట పొలాలను పరిశీలించి, బాధిత రైతులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన కాయగూర రైతులకు తీవ్ర నష్టం వచ్చిందని, వీటిని వ్యవసాయశాఖ అధికారులు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అత్యధిక మంది కాయగూర రైతులు ఉన్నారని, వారికి తీవ్రమైన నష్టం జరిగిందని, యుద్ధ ప్రాతిపదికన నష్టాన్ని అంచనా కట్టి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే వరి పంటకు నష్టం వాటిల్లిందని, కుప్పలు తడిసి ధాన్యం మొలకలు వస్తున్నాయని, వరి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు జె సన్నిబాబు, మహిళ రైతులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం ఇవ్వాలి

మునగపాక రూరల్ : తుఫాను వల్ల నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.30వేలు పరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మజీ డిమాండ్ చేశారు. మండల కేంద్రం మునగపాకలో నీట మునిగిన వరి పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు రూ.30 వేలు నుండి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టడంతో పాటుగా కుటుంబం యావత్తు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ విలయానికి నీటిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా అధికారులు నేటి వరకు పంట నష్టాన్ని అంచనా వేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

బుచ్చయ్యపేట : తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పోలేపల్లిలో శనివారం రైతు సంఘం నాయకులు నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్వి నాయుడు మాట్లాడుతూ నష్టాన్ని అంచనా వేయడంలో వ్యవసాయ శాఖాధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమం రైతు సంఘం నాయకులు కంటమరెడ్డి నరసింహులు, పి సాంబశివరావు, రైతులు సీత పైడినాయుడు, సీత గణేష్, ఈశ్వరరావు, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

నేటికీ నీటి ఉండి కుళ్లిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న రైతు నేతలు

పంటలు పరిశీలన

మాడుగుల : తుపానుతో పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని సిపిఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షురాలు కె.భవాని మాట్లాడుతూ, తుఫాన్‌తో వరి పంటలు నేల కొరిగాయని, కొన్ని ప్రాంతాల్లో కుప్పలు తడిసి నీట మునిగాయన్నారు. రైతులు, కౌలు రైతులు పెట్టిన పెట్టుబడి నీటి పాలయ్యిందన్నారు. పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించి. పరిహారం అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వేచలపు తాతబాబు, గాదం కొండబాబు, కొండపల్లి గంగరాజు, అక్కిరెడ్డి పరదేశి, నాయుడు రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత బ్రహ్మజీ

ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలి

అనకాపల్లి : అనకాపల్లి పట్టణ పరిధిలో తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షులు విల్లూరి పైడారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన దెబ్బతిన్న పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ పోయి మూడు రోజులైనా ఇప్పటికీ వరి పొలాలు పూర్తిగా నీళ్లలోనే ఒరిగిపోయి ఉన్నాయని, రైతుల బాధలు అర్థం చేసుకొని వారికి పరిహారం చెల్లించాలని కోరారు.

నేలమట్టమైన వరి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీష్

ఓటర్ లిస్టులను సవరించకపోతే ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి

ఓటరు జాబితాలను సవరించకుంటే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు హెచ్చరించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో 79,559 ఓట్లు తొలగించాల్సి ఉందన్నారు. జగన్ రెడ్డి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఓట్లను అన్ని నియోజకవర్గాల్లో వైసిపి మంత్రులు, చోట మోట నాయకులతో కలిసి సచివాలయాల సిబ్బందితో దొంగ ఓట్లు నమోదుకు కుట్ర పన్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ కేకేవిఎ నారాయణరావు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో 5 వేల నుండి 20 వేల వరకు జీరో డోర్ నెంబర్‌తో వందల సంఖ్యలో నమోద చేశారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు, ధనాల విష్ణు చౌదరి, కుప్పిలి జగన్మోహన్, బోడి వెంకటరావు, కాయలు ప్రసన్న, మళ్ల గణేష్, పొలిమేర నాయుడు, బుద్ద భువనేశ్వరరావు, బుద్ద మహాలక్ష్మి నాయుడు, సాలాపు నాయుడు, దాడి వేణు తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తుపాన్ కారణంగా మండలంలోని మడుతూరు గ్రామంలో పక్కా గృహం దెబ్బతిన్న బాధితురాలు పట్నాల సత్యవతికి ఆ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి భక్తులు రూ.16 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. తుపాన్ కారణంగా భారీ వర్షం, బలమైన గాలుల వల్ల సత్యవతి ఇంటి పైకప్పు పూర్తిగా దెబ్బతింది. ఆర్థిక స్తోమత లేక నిరాశ్రయురాలు కావడంతో దీక్షలో ఉన్న అయ్యప్ప స్వామి భక్తులు స్పందించి, సత్యవతి నివాసానికి రేకుల షెడ్డు వేసుకోవడానికి తమ వంతు సహాయంగా అందజేశారు. అయ్యప్ప స్వామి భక్తుల ఉదారతను గ్రామస్తులు అభినందించారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక గవరపాలెం పీల వారి గౌరమ్మ కమిటీ ఆహ్వానం మేరకు టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు శనివారం గౌరీ పరమేశ్వరి అమ్మ వారిని దర్శించుకున్నారు. కమిటీ ఆయనకు ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు ఇచ్చారు. అనంతరం నాగ జగదీష్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మళ్ల గణేష్, సాలాపు నాయుడు, బుద్ద భువనేశ్వరరావు, కాండ్రేగుల సత్యనారాయణ, కొణతాల బాల, పీలా శ్యామ్, సూరిశెట్టి బల్లమ్మ, మారిశెట్టి జగన్, కర్రి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

11న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. తుపాన్‌కు మండలంలో వేలాది ఎకరాలు నీట మునిగి నాలుగు రోజులు గడుస్తున్నా పంట నష్టం అంచనా వేయటానికి అధికారులు రాలేదని పేర్కొన్నారు. సోమవారం స్థానిక మెయిన్ రోడ్‌లో గల సహకార సంఘ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని, రైతులు, కౌలు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

నేటికీ జీతాలు చెల్లించకపోవడం సరికాదు

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నారనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరిచి పోయిందని, 9వ తేదీ గడిచినా నేటికీ జీతాలు చెల్లించలేదని ఏపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంఎల్‌ఏలు సకాలంలో జీతాలు తీసుకుంటూ, కష్టపడి పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. ప్రతి నెలా ఉద్యోగులు సకాలంలో ఈఎంఐలు కట్టలేక, ఫైన్ కడుతూ, సిబిల్ స్కోర్ తగ్గిపోయి నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతీ నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

వైఎస్ఆర్ బీమాతో ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వైయస్సార్ బీమా కుటుంబ పెద్ద ఆకాల మృతి చెందుతే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తుందని జివిఎంసి 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ పేర్కొన్నారు. 80వ వార్డులో ఉన్న చినరామ స్వామి గుడిదగ్గర పిల్లా నాయుడు మృతి చెందగా వారి కుటుంబాన్ని కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి చేతుల మీదగా వైయస్సార్ బీమా కింద లక్ష రూపాయిలుకు గాను చనిపోయిన రోజే మట్టి ఖర్చులకు పదివేల రూపాయలు అందజేయగా, మిగిలిన 90 వేల రూపాయలు వారి అకౌంట్లో వేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పొలిమేర అదిబాబు, కర్రి కష్ట, కర్రి ఉమ మహేశ్వరావు, కర్రి రాము, కర్రి నాయుడు, కర్రి రమేష్,కర్రి గోపి, కర్రి సత్యనారాయణ, సూరిశెట్టి రవి, కాండ్రేగుల దేవా, వాలంటీర్ యశోద పాల్గొన్నారు.



బీమా సొమ్ము అందజేస్తున్న కార్పొరేటర్ నీలిమ తదితరులు

రాంకీ విష వ్యర్థ జలాలతో చెరువులో చేపలు మృత్యువాత

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ ఫార్మాసిటీలోని రాంకీ యాజమాన్య నిర్లక్ష్యంతో వల్ల వ్యర్థ రసాయనాలను పరవాడ గ్రామంలోని పెద్ద చెరువులోకి విడుదల చేయడంతో ఆ చెరువులోని చేపలు మృత్యువాత పడ్డాయి. వీటిని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ బాధిత రైతులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా కంపెనీల కాలుష్య వ్యర్థాల వల్ల ప్రతి ఏటా చేపలు మృతి చెందుతున్నాయని, ఈ సమస్యపై అనేక సార్లు విన్నవించినా అటు యాజమాన్యం, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఫార్మా వ్యర్థాల వల్ల ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు, గాలి, నేల పూర్తిగా కలుషితమయ్యాయన్నారు. రాంకీ చైర్మన్ రాజ్యసభ సభ్యుడు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం రాంకీ యాజమాన్యానికి అడుగులకు మడుగులొత్తుతోందని విమర్శించారు. తక్షణమే రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువులో చేపలు మృత్యువాతపై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తున్నట్లు గనిశెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మృతి చెందిన చేపలను చూపుతున్న గనిశెట్టి, రైతులు

చెరువులో మృతి చెంది తేలిన చేపలు

కరువు మండలంగా ప్రకటించాలి

మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం తీర్మానం

సమావేశంలో పాల్గొన్న ఎంపిపి లక్ష్మి, జెడ్‌పిటిసి శ్రీధర్‌రాజు, అధికారులు

ప్రజాశక్తి-కశింకోట

మిచౌంగ్ తుఫాను కారణంగా ధ్వంసమైన వరి పంటలకు నష్ట పరిహారం అందించే విధంగా కశింకోట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి కలగా లక్ష్మి అధ్యక్షతన శనివారం మండల పరిషత్తు సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు మండలంలో ఉన్న సమస్యలపై చర్చించారు. కసింకోట ఎంపిటిసి ఎల్లపు నూకరత్నం మాట్లాడుతూ కసింకోటలో మురుగు నీటితో కూడిన తాగునీరు సరఫరా అవుతుందని, ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పైపులైన్ తనిఖీ చేసి ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించాలని ఎంపిపి ఆదేశించారు. భీమవరం ఎంపిటిసి అల్లం శంకర్రావు మాట్లాడుతూ తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే ప్రధాన రోడ్డు సంత మార్కెట్ వద్ద అధ్వానంగా ఉందని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. అచ్చర్ల సర్పంచ్ సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణాలు జరిగాయని, బిల్లులు మంజూరు కాలేదని పేర్కొన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావును, జగనన్న సురక్ష కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న ఎంపిడీవో రవికుమార్‌ను, ఐసిడిఎస్ సిడిపిఓ ప్రభావతిని సన్మానించారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, నమ్మి మీనా గణేష్, ఎంఈఓ చిట్టిబాబు, ఇంచార్జ్ తహసీల్దార్ సురేష్ నాయుడు, పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాలరావు, ఇరిగేషన్ ఏఈ హనుమంతరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అక్షర స్కూల్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో అధునాతన వసతులతో నిర్మించిన అక్షర ఇంగ్లీష్ మీడియం హైస్కూలు నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ శనివారం ప్రారంభించారు. ఎంపిపి బోకం సూర్య కుమారి పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి పూజా కార్యక్రమాలలో పాల్గొని కరస్పాండెంట్ బోకం అప్పారావును, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఈసిఎస్ మాజీ డైరెక్టర్లు బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, జిల్లా విఆర్‌ఓల సంఘ అధ్యక్షులు సబ్బవరపు త్రినాధ రామకృష్ణ, మాజీ ఎంపిపిలు సబ్బవరపు ముత్యాలనాయుడు, గండి దేముడు, వైసిపి నేత కర్రిబాబు, టిడిపి నేత గండి రవికుమార్, ఎంఈఓ బిఎస్ఎన్ మూర్తి, గొర్లి కనకరాజు, సర్పంచ్‌లు నేబర్తి శ్రీనివాసరావు, బి.కనకరాజు, బోను గంగునాయుడు, బండారు శ్రీనివాసరావు, ఎడ్లనాయుడు, జెట్టి హేమంత్ పాల్గొన్నారు.

టిడిపి వస్తే సూపర్ సిక్స్ పథకాల అమలు

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, విద్యుత్ ధరల తగ్గింపు వంటి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి పట్టణం, 81వ వార్డు, గవరపాలెంలో శనివారం భవిష్యత్తుకు గ్యారెంటీ- బాబు షూరిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన వైసిపి జబ్బుకు టీడీపీ- జనసేన పొత్తుతో పోతుందన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ళ సురేంద్ర, పీలా శ్రీనివాసరావు, కాంగ్రెస్ చిన్న, కాంగ్రెస్ రాజు, మొయ్య నూకరాజు, భాను చంద్ర అఖిల్, పాల్గొన్నారు.

తాగునీటి బోర్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కొన్నెంపూడి రైతుల కల్లాల వద్ద విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఐదు తాగునీటి చేతి బోర్లను మంజూరు చేయగా, వీటిన నిర్మాణ పనులను విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైసిపి కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి కొల్లిమళ్లి అచ్చంనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ డెయిరీ కొన్నెంపూడి గ్రామాన్ని అన్ని విధాలుగా ఆదుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాలు సొసైటి అధ్యక్షులు దొండా శీను, పద్దాది పిఎసిఎస్ అధ్యక్షులు దొండ సన్యాసిరావు, సూరి అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ దాడి సూరి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు శ్రీను, వేపాడ మధు, నాయకులు పాల్గొన్నారు.

12 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కశింకోట : కసింకోట మండలం చింతలపాలెం జాతీయ రహదారి పక్కన ముగ్గురు వ్యక్తులను గంజాయి ప్యాకెట్లతో శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు కసింకోట ఎస్సై జై నాగేశ్వరరావు తెలిపారు. అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పరిశీలించగా 12 కేజీలు గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. కేరళ రాష్ట్రానికి చెందిన మహేంద్రన్, నంద కిషోర్, ఆరీఫ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి డిఎస్‌పి సుబ్బరాజు పర్యవేక్షణలో అనకాపల్లి రూరల్ సిఐ రవికుమార్ విచారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు సంబంధించిన మిగిలిన సభ్యులను అరెస్ట్ చేస్తామని సిఐ తెలిపారు.

ఆలయంలో అన్న సమారాధన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన్న కార్యక్రమం నిర్వహించారు. రాజాన రుత్విక్ సాయి హర్ష జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమం చేశారు. ప్రతి శనివారం భక్తులు, విరాళ దాతలు సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమాలను భక్తుడు కూండ్రపు వెంకటరమణ పర్యవేక్షిస్తున్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో గవరపేట రామకోవుల వద్ద శనివారం కార్తీక మాసం సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం మహిళల చిడతలు, భజనలు కోలాటం ప్రదర్శించారు. రాత్రి గౌరీ పరమేశ్వరుల నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో 3,000 మంది ప్రజలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాజీ మార్గం ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ తిరిగే పని ఉండదని అనకాపల్లి జిల్లా జడ్జి శ్రీవిద్య పేర్కొన్నారు. నేషనల్ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం అనకాపల్లి కోర్టుల్లో అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ కక్షిదారులకు పలు సూచనలు చేశారు. అనవసరమైన గొడవలు పెంచుకొని బంధుత్వాలు పోగొట్టుకోవద్దని హితవుపలికారు. కోర్టుల చుట్టూ తిరిగితే ఆర్థికంగా కూడా ఇబ్బందులు పడతారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కక్షిదారుల ప్రయోజనార్థం నిర్వహిస్తున్న లోక్ అదాలత్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ గంగరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రదీపా, రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ విజయలక్ష్మి, మూడో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ శివకిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి లక్ష్మణ్, సెక్రెటరీ సూరా శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సాయిరాం, రామచంద్ర రావు, కిషోర్, లీలా, సురేష్, ఎమ్ఎల్ఎస్‌సి ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రమదానంతో పంట కాలువ పూడికతీత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో వరి పంటలను ముంచుతున్న పంట కాలువను రైతులు శనివారం శ్రమదానంతో పూడిక తీత పనులు చేపట్టారు. సాంగ్ గెడ్డ ప్రాంతంలో తుఫాను కారణంగా పడిన వర్షం నీరు, తాండి కాలువల ద్వారా పొంగి ప్రవహించిన వరద నీరు పంట పొలాలను ముంచింది. నీటిలో మునిగిన వరి పంటను కాపాడుకోవడానికి రైతులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పంటలకు మధ్యన ఉన్న పంట కాలువను పారలు కత్తులు పట్టి శుభ్రం చేశారు. పూడిక తీయడం వలన పంట భూములలో ఉన్న నీరు కాలువలోకి ప్రవహించి బయటికి వెళ్ళింది. ఈ శ్రమదాన కార్యక్రమంలో రైతులు సరగడం రామ అప్పలనాయుడు, కర్రి జోగినాయుడు, భీశెట్టి సోమరాజు, సరగడం అప్పారావు, కన్న సూరి తదితరులు పాల్గొన్నారు.

రామలింగ స్వామి పురస్కారానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్టు ద్వారా అందించే డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార అవార్డు 2024కు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ట్రస్ట్ నిర్వాహకురాలు కొణతాల లక్ష్మీ పార్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా నిస్వార్థంగా సామాజిక సేవలు నిర్వహించే వారిని గుర్తించి అటువంటి ఈ పురస్కారాలను అందిస్తామన్నారు. ఔత్సాహికులు తాము చేసే సేవా కార్యక్రమాలను దరఖాస్తుతో పాటు జత చేయాలన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పురస్కార అవార్డులు తీసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఔత్సాహికులు తమ దరఖాస్తులను డాక్టర్ కొణతాల రామలింగస్వామి ట్రస్ట్, తిలక్ మార్క్, డోర్ నెంబర్ 12-118, చిన్న బాబు కాలనీ, తుమ్మపాల గ్రామం, అనకాపల్లి మండలం అనకాపల్లి జిల్లా 531032 అడ్రస్‌కు పంపాలని సూచించారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలోని గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత నెలలో గౌరీ పౌర్ణమి నాడు ప్రారంభమైన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం అమ్మవారికి భారీగా సారెను ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి గ్రామ పురవీధుల్లో అమ్మవారి అనుపు మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్‌పిటిసి కర్రి సత్యం, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కశింకోట : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి బొంతు శ్రీనివాసరావు అన్నారు మండలంలోని నర్సింగబిల్లిలో సాయిబాబాకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రానున్న రోజుల్లో విజయం సాధించడం కోసం కార్యకర్తలు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కర్రి దుర్గునాయుడు, జెర్రిపోతుల నూకనాయుడు, కలగా సోమేశ్వరరావు, సిద్ధిరెడ్డి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ బుదిరెడ్డి గంగయ్య, సిద్ది రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

'ఆడుదాం ఆంధ్రా' కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఆడుదాం ఆంధ్ర స్పోర్ట్స్ కిట్లను మండలంలోని 20 సచివాలయాలకు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు శనివారం దేవరాపల్లి సచివాలయం 1 వద్ద పంపిణీ చేశారు. డిసెంబర్ 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా సంగ్రామానికి సంబంధించిన కిట్లు మండలానికి చేరుకోగా వాటిని మండల పరిధిలోని సచివాలయాలకు అందజేశారు. మండల కేంద్రానికి మూడు, ప్రతి సచివాలయానికి ఒక్కొక్క కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కర్రి సత్యం, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, కర్రి సూర్య నాయుడు, ఆర్‌వికె నాయుడు, లలితా నాయుడు, వరదపురెడ్డి సింహాచలం నాయుడు, ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన టిడిపి, జనసేన శ్రేణులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : కె.కోటపాడు మండలం చౌడువాడ పంచాయతీ పరిధి చౌడువాడ, మల్లంపాలెం గ్రామాలకు చెందిన టిడిపి, జనసేన పార్టీలకు చెందిన 70 కుటుంబాలకు చెందిన 90 మంది సందరపు గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం తారువలోని డిప్యూటీ సిఎం క్యాంప్ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో శనివారం వైసిపిలో చేరారు. వారికి ఉప ముఖ్యమంత్రి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి ద్వారా ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందించడానికి ఏకతాటి పైకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కుమార సోమునాయుడు, కుమార వెంకటరమణ, మోదునాయుడు, కనకరావు, ఎర్రి నాయుడు పాల్గొన్నారు.

11న శూలాల మహోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : శ్రీచౌడేశ్వరి సాంబశివ శూలాల మహోత్సవం ఈనెల 11న నిర్వహించనున్నట్లు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి తెలిపారు. ఎంపీ కార్యాలయంలో శనివారం ఆమె శ్రీచౌడేశ్వరి సాంబ శివాలయం కమిటీ సభ్యులతో కలిసి మహోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఏటా కార్తీక మాసం నాల్గవ సోమవారం ఈ పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బల్లా నాగభూషణము, డాక్టర్ కె.విష్ణుమూర్తి, ఆర్.చంద్ర రావు, వేమన సంతోష్, లోకనాథం, కృష్ణబాబు పాల్గొన్నారు.

నేడు పైల అప్పలనాయుడు వర్ధంతి

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ మాజీ శాసనసభ్యులు పైల అప్పలనాయుడు (నాయుడుబాబు) 19వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు వైసిపి రాష్ట్ర సిఈసి సభ్యులు పైల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం 9.30 గంటలకు పరవాడ సంతబయల వద్ద గల పైల అప్పలనాయుడు కాంస్య విగ్రహం వద్ద నివాళర్పించడానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పెందుర్తి శాసనసభ్యులు, అన్నంరెడ్డి అదీప్ రాజ్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు హాజరు కానున్నారని తెలిపారు.

సన్యాసిరావు మృతి వైసిపికి తీరని లోటు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గండి సన్యాసిరావు మృతి వైసిపికి తీరని లోటని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. బంగారయ్యపాలెం గ్రామంలో మృతి చెందిన గండి సన్యాసిరావు మృతదేహాన్ని సందర్శించి, కుటుంబీకులను పరామర్శించారు. సన్యాసిరావు సహకార సంఘం అధ్యక్షులుగా, పార్టీ సీనియర్ కార్యకర్తగా చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, రాంబాబు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, నాయకుడు కోన బుజ్జి, నర్మల కుమార్, జె అప్పలనాయుడు పాల్గొన్నారు.

సన్యాసిరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఓటర్ల జాబితాల తయారీలో అప్రమత్తంగా ఉండాలి

-కలెక్టర్ రవి పటాన్‌శెట్టి - ఓటర్ల శిబిరాలను సందర్శన- వడ్డాది వంతెన పరిశీలన

ప్రజాశక్తి -కోటవురట్ల: ఎన్నికల జాబితా తయారీ విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పటాన్ శెట్టి సూచించారు. శనివారం మండల కేంద్రంలో సమావేశ మందిరం వద్ద నియోజకవర్గ ఎన్నికల అధికారి రామలక్ష్మి ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ఆకస్మికంగా హాజరై సమాచారం అడిగి తెలుసుకున్నారు. శనివారంతో ఎన్నికల నమోదు, సవరణ, తొలగింపునకు ఆఖరి రోజు కావడంతో సమగ్ర వివరాలు పొందుపరచాలని అధికారులకు సూచించారు. రాజకీయాలకు అతీతంగా సిబ్బంది విధుల పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలని లేకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని గుర్తించాలన్నారు. సామాన్యుల పట్ల ఏకపక్ష ధోరణి తగదని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకట జయరాం, తహసిల్దార్ జానకమ్మ, ఎన్నికల సూపర్వైజర్లు, బూత్ బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ఓటర్ల జాబితా రూపకల్పనకు సిబ్బంది శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశించారు. శనివారం మాకవరపాలెం మండలం తామరంలో నిర్వహించిన ఓటర్ల సవరణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ శిబిరంలో వచ్చిన కొత్త ఓట్ల నమోదు, తొలగింపులు, చేర్పులపై అందిన దరఖాస్తులను తనికీ చేసి సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట ఆర్డీవో జయరాం, తహశీల్దార్ ప్రసాదరావు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

వంతెనను పరిశీలించిన కలెక్టర్

వడ్డాది: తుఫాన్‌తో దెబ్బతిన్న వడ్డాది శారద నదిపై ఉన్న వంతెన మరమ్మత్తులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి ఆదేశించారు బుచ్చియ్యపేట మండలం వడ్డాదిలో శనివారం ఆయన పర్యటించారు ఈ సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో రహదారులు, వంతెనలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ముఖ్యంగా రైతులు వరి, చెరుకు పంటలు ఎక్కువగా నష్టపోయారని తెలిపారు. పంట నష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. మరో రెండు రోజుల్లో వంతెన మరమ్మతులు చేపట్టి వాహనదారులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, జడ్పిటిసి దొండా రాంబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

వడ్డాదిలో వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్ పట్టన్‌శెట్టి

వైఎస్ భారతి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 60వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లో శనివారం వైసిపి నగర ప్రధాన కార్యదర్శి సరగడం పత్నిరావు ఆధ్వర్యాన జగన్మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్.భారతి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కేకు కట్ చేసి భారతమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి.కామాక్షి, కనకమహాలక్ష్మి, సుబ్బలక్ష్మి, చిన్నతల్లి, రాజేశ్వరి, కనక, జయమ్మ, పాల్గొన్నారు.

కొనసాగిన గాలింపు

ప్రజాశక్తి- అనంతగిరి:లువ్వా గెడ్డలో గల్లంతయిన మృతదేహం కోసం గాలింపు చర్యలు శనివారంతో నాలుగు రోజులకు చేరుకుంది స్థానిక ఎస్ఐ రాము ఆధ్వర్యన మూడు బృందాలుగా ఏర్పడి ఎన్టీఆర్ఎఫ్ గెడ్డ ఇరువైపులా గాలించాయి. తాటిపూడి జలసయం వద్ద ముమ్మరంగా జల్లెడ పట్టారు. అయినా లభ్యం కాలేదు. మృతదేహం ఎక్కడో చోట ఊబిలో కూరుకు పోయి ఉండవచ్చునని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు భావిస్తున్నాయి. కుటుంబ సభ్యులు తిండి తిప్పలు లేకుండా రాత్రి పగలు విలపిస్తున్నారు.

14న గ్రామీణ కష్టజీవుల ధర్నా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:వలసలు, కరువు నివారణకు ఉపాధి హామీ పనులు ప్రతి గ్రామంలో ప్రారంభించి, కష్ట జీవులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెలుగుల అర్జునరావు, మాకిరెడ్డి రామానాయుడు డిమాండ్ చేశారు. ఈ నెల 14న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే గ్రామీణ కష్టజీవుల ధర్నా పోస్టర్లను ఆవిష్క రించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కమ్యూనిస్టుల మద్దతుతో ఏర్పాటైన ఆనాటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందిం చిందన్నారు. ఉపాధి పని ప్రదేశంలో పని చేస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కమిషన్ పెంచాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యోగ భద్రత కల్పించి వారిపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు శివలంక కొండలరావు, రాష్ట్ర సమితి సభ్యురాలు చింతలపూడి విజయలక్ష్మి, చోడే శ్రీనివాస్ చౌదరి, రైతుసంఘం నాయకులు గొల్లు గురుబాబు, రాజారామ్ మోహన్ రాయ్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పూడిక పనులు చేస్తున్న ఎంపిటిసి నాగేశ్వరరావు

కాలువలో పూడిక తీత పనులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పెదతీనార్ల ఎంపీటీసీ సభ్యులు నాగేశ్వరరావు శ్రమదానం ఆధ్వర్యాన గ్రామ దేవత ఆలయానికి వెళ్లే మార్గంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాలువ పూడిక తీత పనులు చేపట్టారు. కాలువ పూర్తిగా మట్టితో కూరుకు పోయి, తుప్పలు అలుము కున్నాయి. దీంతో వర్షపునీరు ప్రవహించడానికి ఆటంకం కలుగుతుంది. ఈ మేరకు కాలువ పనులు చేపట్టి శుభ్రం చేశారు.

పవన్‌పై దిగజారుడు వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌పై మంత్రి అమర్‌నాథ్ దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర హితవు పలికారు. శనివారం ఆయన మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్‌ను దూషించడమే అమర్‌నాథ్‌కు మంత్రి పదవి ఇచ్చినట్లు ఉందన్నారు. అమర్‌నాథ్ మంత్రి పదవి చేపట్టాక విశాఖ నుంచి 42 పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయన్నారు. విస్తన్నపేటలో కొండలు, గుట్టలు ఆక్రమించడం, లోకాయుక్త కేసు ఉండటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, 9వ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, టౌన్ నాయకులు మారిశెట్టి రాజా, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నాతవరం మండ లానికి చెందిన పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ శనివారం పంపిణీ చేశారు. మండలానికి చెందిన మాసారపు పార్వతికి రూ.16వేలు, జక్కంశెట్టికి రూ.18వేలు, చేవెల లోవరాజుకి రూ.90వేలు, రుత్తల అపర్ణకి రూ.3.30లక్షలు, ఇనపసప్పల గురువులమ్మకి రూ.28వేల చొప్పున మొత్తం రూ.4.82లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయా బాధిత కుటుంబాలు సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

నర్సీపట్నంలో వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం నర్సీపట్నంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ, సోనియాగాంధీకి దేశానికి రెండు దఫాలు ప్రధానిగా అవకాశం వచ్చినా త్యాగం చేసారన్నారు. పదవులకంటే ఈ దేశ సమక్షేమమే ముఖ్యంగా భావించే కుటుంబం అని కొనియాడారు. మతతత్వం, ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదులు మీద పోరాటం చేసే కుటుంబమన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నంగిన రమణ, రామారావు, స్వామినాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల గ్రామంలో శనివారం అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు, గర్భిణీలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బి.యేసయ్య, పార్టీ మండల శాఖ అధ్యక్షులు ప్రసాదుల సత్యనారాయణ, మాజీ మండల శాఖ అధ్యక్షులు ఎన్ఎస్‌వి సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎం.అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి: సోనియా గాంధీ 77వ పుట్టిన రోజు వేడుకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ నాయకులు రిక్షా కార్మికులు, పేదలకు వస్త్ర దానం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి 19 ఏళ్ల పాటు అధ్యక్షురాలిగా పనిచేసిన సోనియా గాంధీ, యుపిఎ 1, 2 ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీహక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం వంటి కీలక చట్టాలు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అనకాపల్లి కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు కాళ్ళ వెంకట సత్యనారాయణ (ఏడు కొండలు), పార్లమెంటరీ సమన్వయకర్త బోయిన భాను మూర్తి యాదవ్, సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సేనాపతి ఈశ్వరరావు, టి. సుబ్బిరామిరెడ్డి సేవా పీఠం మాజీ సభ్యులు కెవి మాణిక్యం పాల్గొన్నారు.

అకాపల్లిలో దుస్తులు అందజేస్తున్న నేతలు

వడ్డాది : సోనియాగాంధీ జన్మదిన వేడుకలు శనివారం వడ్డాదిలో ఘనంగా నిర్వహించారు. టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యపురెడ్డి సత్యనారాయణ, ఉత్తరాంధ్ర చర్చ వేదిక చోడవరం కన్వీనర్ అడపా నరసింహమూర్తి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. సోషల్ వర్కర్ ఆరిపాక కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

కలెక్టరేట్ : విశాఖ నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఎఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ 76వ పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పార్టీ నగర అధ్యక్షులు గొంప గోవిందరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కవరపు రామారావు, రాష్ట్ర నాయకులు చోడదాసి సుధాకర్, పిసిసి కార్యదర్శి వేగి వెంకటేష్, మహిళా రాష్ట్ర నాయకురాలు కూచి లక్ష్మి పాల్గొన్నారు.

తరలి వచ్చిన గర్భిణీలు

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మాకవరపాలెం:మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పిఎం మాతృత్వ సురక్ష యోజన పథకంలో భాగంగా గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి సీతారామహాలక్ష్మీ ఆధ్వర్యంలో సుమారు 50 మంది గర్భిణీలకు బీపీ, రక్త పరీక్షలు చేశారు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రక్తహీనతతో ఉన్న వారికి ముందులు అందించారు. పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం వద్దని వైద్యాధికారి సూచించారు.

జెసిఎస్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా గోవిందు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని అమలాపురం పంచాయతీ మూలపర్ర గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సూరకాసుల గోవిందు జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు వెలుబడ్డాయని గోవిందు స్థానిక విలేకరులకు తెలిపారు. తమపై ఉన్న నమ్మకంతో జే సీ ఎస్ జిల్లా కోఆర్డినేటర్ గా నియమించి నందుకుగాను సీఎం జగన్ మోహన్‌రెడ్డి, ఉత్తరాంధ్ర వైఎస్ఆర్ సిపి ఇన్చార్జ్ వైవి సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్యే గొల్ల బాబురావు, జెసిఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ చైర్మన్ చిక్కాల రామారావు, నక్కపల్లి మండల పార్టీ శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు. పదవి మరింత బాధ్యతను పెంచిందని , మరింతగా పార్టీని బలోపేతం చేసి, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని గోవిందు అన్నారు.

శిథిల భవనం పరిశీలిస్తున్న అప్పారావు

పాఠశాల భవనం మంజూరుకు కృషి

- ఉపవిద్యాశాఖాధికారి పి.అప్పారావు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పెదబోదుగల్లం లో శిథిలంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులను శనివారం యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు పరిశీలించారు. తుఫాన్ ప్రభావానికి కురిసిన వర్షానికి తరగతి గదుల శ్లాబ్ పెచ్చులూడి పడడంతో స్థానిక మండల విద్యాశాఖాధికారి కె.నరేష్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఇప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారని, సమస్యను పరిష్క రించాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉపవిద్యాశాఖాధికారి పి.అప్పారావు పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. శిథిలమైన తరగతి గదులను ఉపయోగించ రాదన్నారు. ఆ తరగతి గదులను బ్లాక్ చేసి పిల్లలను దరి చేరకుండా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సి. హెచ్.సత్యనారాయణ మాట్లాడుతూ, కేవలం ఏడు తరగతి గదులు ఉండగా వాటిలో ఐదు గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, కేవలం రెండు తరగతి గదులలో మాత్రమే తరగతులను నిర్వహించడానికి అవకాశం ఉందని తెలిపారు. పాఠశాల వసతి సమస్యను గుర్తించిన అప్పారావు మాట్లాడుతూ, వీలయినంత త్వరగా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను నివేదించి నూతన తరగతి గదుల మంజూరునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి కె.నరేష్, డి.ఆర్.వో.దయానిధి, పాఠశాల కమిటీ చైర్మన్ మహబూబ్ నిషా ఉన్నారు.

ఆహార భద్రత చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: వినియోగదారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆహార భద్రత చట్టం పై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు కల్పించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వినియోగదారుల సంక్షేమ సేవా సంఘం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు కంబిడి సువర్ణ రాజు, వినియో దారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు కొర్ర బైరాగిమూర్తి, సెక్రెటరీ టి.రామస్వామి, కిల్లో. వాసు, సీదరి. చందు, మర్రి. సోంబాబు, కిల్లో. నాని కన్స్యూమర్ క్లబ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో 'యువగళం' పాదయాత్ర

- 11న లోకేష్ రాక - భారీగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు- పార్టీ శ్రేణులు తరలి రావాలని అనిత పిలుపు

ప్రజాశక్తి-నక్కపల్లి: జిల్లాలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ చేపట్టనున్న యువ గళం పాదయాత్రను విజయవంతం చేయడానికి టిడిపి శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. ఈ యాత్రలో పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వాములు చేసేందుకు నాయకత్వం ప్రణాళిక తయారు చేసింది. పాయకరావుపేట నియోజకవర్గంలో ఈ నెల 11న లోకేష్ ప్రవేశించనున్నారు. లోకేష్‌కు పెద్ద ఎత్తున కార్యకర్తలు స్వాగతం పలకాలని పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని సారిపల్లివాని పాలెం వద్ద తన ఇంటి ప్రాంగణంలో శనివారం జరిగిన పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో అనిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లోకేష్ పాదయాత్ర 11న పాయకరావుపేట చేరుకొనేటప్పుడు పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. 12న పాయకరావుపేట వైభవ్ లే-అవుట్ దగ్గర నుంచి పాదయాత్ర బయలుదేరుతుందన్నారు. గొడిచర్లకు పాదయాత్ర చేరేసరికి పదివేల మంది మహిళలతో స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 13 వరకు పాదయాత్ర కొనసాగుతున్నందున నియోజక వర్గంలోని కార్యకర్తలు, స్థానిక పార్టీ బాధ్యులు మండల ఇన్‌ఛార్జ్‌లతో సమన్వయం చేసుకోవాలన్నారు. పాదయాత్ర నియోజవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ముఖద్వారం పాయకరావుపేట నియోజకవర్గంలో లోకేష్‌కు పలికే స్వాగతం ప్రజల మనస్సుల్లో నిలిచి పోయేలావుండాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రస్థాయి పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి చింతల రామకృష్ణ, కాకినాడ రామారావు, మాజీ ఎమ్మెల్సీ బాబురావు మాస్టర్, ప్రభాకర్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్ రాజు, మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ జిల్లా నాయకులు జనార్ధన్, గింజాల లక్ష్మణరావు, కురందాసు నూకరాజు, దేవర సత్యనారాయణ, నల్లల వెంకటరాజు, కొప్పిశెట్టి బుజ్జి, వెలగా శ్రీనివాస్, గోసల శ్రీకాంత్, గుర్రం రామకృష్ణ, పెద్దిరెడ్డి శ్రీనివాసరావు, కోన అప్పలరాజు, నాగరాజు, వెదుళ్ళ పాపారావు, మహిళా అధ్యక్షురాలు రమా కుమారి, ఆకేటి శాంతి, సర్పంచులు ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న అనిత

పక్కాగా ఓటర్ల జాబితాలు ఉండాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: ఎటువంటి తప్పిదాలు లేకుండా ఓటరు జాబితా పక్కాగా తయారు చేయాలని డిఆర్ఓ దయానిధి అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ అంబేద్కర్ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ నుండి వచ్చిన అప్లికేషన్లు ఆన్లైన్ చేయాలన్నారు. అర్హులైన యువతీ, యువకులను తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయాలన్నారు. చేర్పులు, మార్పులు, తొలగింపులు వంటివి పక్కాగా ఉండాలని, ఎటువంటి పొరపాట్లు లేకుండా చూసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డి సత్యనారాయణ, ఎంఈఓ నరేష్ పాల్గొన్నారు.

బిఎల్ఒలు బాధ్యతగా పనిచేయాలి

మాకవరపాలెం: ఓటర్ల జాబితాలు తయారీలో బిఎల్వోలు బాధ్యతగా పని చేయాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం ఆదేశించారు. శనివారం మాకవరపాలెం మండలం లచ్చన్న పాలెం, మాకవరపాలెం గ్రామాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కోసం ఏర్పాటు చేసిన సెంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాదరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జాబితాలు పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

సన్ ఇనిస్టిట్యూట్‌లో 'కేక్ మిక్సింగ్ గ్రేప్ స్టామింగ్' వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అన్ని పండుగల సమ్మేళనమే భారతదేశ గొప్పతనమని సన్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి పేర్కొన్నారు. శనివారం రాత్రి సన్ క్యాంపస్‌లో క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని 'కేక్ మిక్సింగ్ గ్రేప్ స్టామింగ్' వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల డ్రై ఫ్రూట్స్, నట్స్, విస్కీ, జిన్ తదితర పదార్థాలతో భారీ కేకును మిక్సింగ్ చేసేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రిస్మస్ ట్రీతోపాటు విద్యుత్ కాంతుల నడుమ క్రిస్మస్‌ను ఆనందంగా జరుపుకోవాలన్న ఆకాంక్షతో ఇలా వినూత్నంగా తయారు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఏడాదీ ఈ సాంప్రదాయాన్ని, సంస్కృతిని కొనసాగిస్తున్నామన్నారు. కొన్ని రోజులు నిల్వ ఉంచిన అనంతరం తయారైన కేకులను నగరంలోని వివిధ వృద్ధాశ్రమాలు, చిల్డ్రన్ హోమ్ స్కూల్స్‌కు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలియజేశారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా రాడిసన్ బ్లూ హోటల్ జిఎం అభిషేక్ పాణి, డైరెక్టర్ ఆఫ్ సేల్స్ రాజ్ కిరణ్, హెచ్ఆర్ మేనేజర్ రత్నకుమార్, డైరెక్టర్ ఆఫ్ ఎఫ్ అండ్ బి సైలెస్ గురుంగ్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

కేక్ మిక్సింగ్ వేడుకల్లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

మానసిక రుగ్మతలపై డాక్టర్ నిహాల్ విస్తృత చర్చ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఎంవిపిలోని కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ మానసిక వైద్యుడు డాక్టర్ నిహాల్ భారతీయ మానసిక వైద్య సంఘం ఆహ్వానంపై న్యూఢిల్లీలో జరుగుతున్న సైకోథెరపీ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రసంగించారు. వివిధ మానసిక రుగ్మతలకు చేయాల్సిన కౌన్సిలింగ్ విధానాలలో వస్తున్న నూతన పోకడలను విస్తృతంగా చర్చించారు. ఈ సదస్సులో అంతర్జాతీయ సైకోఅనలిస్ట్, అమెరికన్ వైద్యుడు డాక్టర్ సల్మాన్ అఖ్తర్, భారతీయ మానసిక వైద్య సంఘం అధ్యక్షులు డాక్టర్ వినయ్ కుమార్, మైసూరు ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణరావు, దేశం నలుమూలల నుంచి వైద్యులు పాల్గొన్నారు. డాక్టర్ ప్రతాప్ శరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆగ్రాకు చెందిన డాక్టర్ కష్యప్ వందన సమర్పణ చేశారు.

వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు

పింఛను మంజూరు చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని గుంటగన్నేల పంచాయతీ సోలాప్ గూడ గ్రామంలోని అందురాలైన కిలో కరుణ అనే బాలికకు వెంటనే వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ అల్లూరి జిల్లా కన్వీనర్ సుజాత సాల్మన్ డిమాండ్ చేశారు. గురువారం ఆ గ్రామంలో ఆమె సందర్శించి ఓటు నమోదు కార్యక్రమం చేపట్టారు. తల్లిదండ్రులు లేని అనాధ బాలిక అందురాలైన కరుణకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అన్నారు. వెనక ముందు ఎవరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతుందని చెప్పారు. పింఛన్లు చేయించు కోవడానికి ఇటువంటి అభాగ్యులు పింఛన్లకు నోచుకోలేకపోతున్నారని చెప్పారు.